క్లుప్తంగా

అమ్మవారి చెంత భక్తుల సందడి



నవాబుపేట: మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారి ఆలయం చెంత భక్తుల సందడి నెలకొంది. ఆలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా అమ్మావారికి బోనాలు సమర్పించారు. చెట్లకింద సేదతీరారు.

త్రైత సిద్ధాంతం జ్ఞానాన్నిస్తుంది

నవాబుపేట: త్రైత సిద్ధాంతం ప్రతి వ్యక్తికి అమిత జ్ఞానం సంపాదించేలా బోధనలు చేస్తుందని.. సేవాసమితి జిల్లా అధ్యక్షుడు నాగ్యనాయక్ తెలిపారు. ఆదివారం సమితి ఆద్వర్యంలో మండలంలో త్రైతసిద్ధాంత భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుచ్చిలింగం, అమూల్య, తిరుపతయ్య, కృష్ణయ్య, వినిత, కిరణ్ తదితరులు ఉన్నారు.

ముగిసిన వార్షికోత్సవాలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రాంగణంలోని బొటానికల్ గార్డెన్‌లో వార్షికోత్సవం ఆదివారం ముగిసింది. కార్యక్రమానికి స్థానిక సీఐ ఆదిరెడ్డి హజరై గార్డెన్‌ను సందర్శించారు. గార్డెన్‌లో మొక్క నాటి నీళ్లు పోశారు. ఇలాంటి గార్డెన్ ఇప్పటి వరకు తాను చూడలేదని, జడ్చర్ల ప్రాంతానికి తలమానికంగా నిలుస్తుందని కొనియాడారు. గార్డెన్‌తో పాటు బయోడైవర్సిటీ రీసెర్చ్‌సెంటర్, హెర్బేరియంలు కళాశాలకు ప్రత్యేకలుగా నిలుస్తాయన్నారు. లాబ్‌లో నిల్వ చేసిన అతిపెద్ద జెర్రిపోతు కుబుసం చూసి అటవీ సంరక్షణతోపాటు పాముల సంరక్షణ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య, పరిశోధక విద్యార్థి రమాదేవి, వలంటీర్లు రాహుల్, వీరాంజనేయులు, శ్రీను, అంకిత, అలేఖ్య పాల్గొన్నారు.

ఓపికతో ఉంటేనే అవకాశాలు

పాలమూరు: మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి ఎన్నో పార్టీలు మారాడని ఇక మిగిలింది కేవలం ఎంఐఎం పార్టీ మాత్రమేనని.. బీజేపీ పార్టీ సముద్రం లాంటిదని పోయే నీరు పోతుంటే కొత్త నీరు వస్తుంటుందని క్రమశిక్షణ కమిటీ సభ్యుడు నాగురావు నామాజీ అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థిరత్వం లేకుండా చంచల గుణం కల్గిన వ్యక్తులు పార్టీ నుంచి వెళ్తంటే ఎవరూ వద్దు అని చెప్పరన్నారు. పార్టీలలో పని చేసేటప్పుడు పదవులు కాకుండా ఓపికతో ఎదురుచూడాలని, తప్పకుండా భవిష్యత్‌లో మంచి అవకాశాలు పార్టీ కల్పిస్తుందన్నారు.

వైభవంగా ఈదమ్మ జాతర



అమిస్తాపూర్‌లో ఈదమ్మను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు



పూజలు చేస్తున్న డీకే అరుణ

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో ఆదివారం ఈదమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో అమ్మవారిని బీజేపీ జాతీయ అధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజుల పాటు జరిగే ఈదమ్మ ఉత్సవాల్లో భాగంగా మొదటి శకటోత్సవం, రెండోరోజు బోనాలతో ప్రదక్షిణలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. మండల బీజేపీ నాయకులు రాజగోపాల్‌రెడ్డి, గూటం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



జంగమయ్యపల్లి గ్రామంలో బోనాల ఊరేగింపు

ఘనంగా బోనాల పండుగ

నవాబుపేట: మండల పరిధిలోని జంగమయ్యపల్లి గ్రామంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపులు చేపట్టారు. గ్రామ దేవతలకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలకు వచ్చిన ఆడపడుచులకు పుట్టింటి సారేను అందించిన గ్రామస్తులు ఆదివారం విందులు ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ వెంకటేష్, రాజు, వెంకటయ్య, గోపాల్, వెంకటేష్, లింగం, శేఖర్, బాల్‌రాజ్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

దయానంద సరస్వతి జయంతి



యజుర్వేద గాయత్రి యజ్ఞం

జడ్చర్ల టౌన్: మహర్షి దయానంద సరస్వతి 200వ జయంతి పురస్కరించుకుని పట్టణంలోని ఆర్యసమాజంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా క్రాస్‌రోడ్డు నుంచి పురవీధుల గుండా ఆర్యసమాజం వరకు శోభయాత్ర జరిపించారు. యాత్ర అనంతరం యజుర్వేద గాయత్రి యజ్ఞం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన హైదరాబాద్ ఆర్యప్రతినిధి సభ అధ్యక్షుడు విఠల్‌రావు ఆర్య, ఉపాధ్యక్షుడు బాదిమి శివకుమార్‌లు ఉపన్యాసం ఇచ్చారు. మహర్షి దయానంద సరస్వతి గురించి తెలియజేశారు. ఆయన స్ఫూర్తిగా హిందు ధర్మ పరిరక్షణకు ఆర్యసమాజం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్యసమాజ ప్రతినిధులు, విశ్వహిందూపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో మిగిలేది నలుగురే



పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రమేష్‌యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పలువురు యాదవ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే యెన్నం సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యెన్నం మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుల ఆదేశానుసారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను పార్టీలో చేర్చుకున్నట్లు వివరించారు. ఎంపీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల ఎన్నికల కంటే అధిక మెజార్టీతో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ అభ్యర్థులను గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతి ఇద్దామని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో రాబోయే ఎన్నికల్లో 49 కౌన్సిలర్లను గెలిపించుకోవాలని, సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. బీఆర్‌ఎస్ పార్టీలో కేవలం ఆ నలుగురే మిగులుతారని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు ఎన్‌పీ.వెంకటేశ్, ఎం.సురేందర్‌రెడ్డి, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, రమేశ్, రాములుయాదవ్ పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఉన్న సైనిక క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. సౌకర్యాలు ఎలా ఉన్నాయని అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అక్కడి సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి క్యాంటీన్ కోసం మరోచోట స్థలం కేటాయించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, అడ్వజర్ వెంకటయ్య పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్‌కు ఘనసన్మానం



బెల్లయ్యనాయక్‌తో జిల్లా నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర గిరిజన అభివృద్ధి చైర్మన్‌గా నియమితులైన ఆదివాసీ విభాగం అధ్యక్షుడు బెల్లయ్య నాయక్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పలువురు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎస్టీసెల్ నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ పటిష్టత కోసం నిరంతరం పనిచేస్తున్న బెల్లయ్య నాయక్‌కు గిరిజన అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు లింగంనాయక్, గద్వాల జిల్లా అధ్యక్షుడు శివనాయక్, మహబూబ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు రవి నాయక్, జిల్లా కోకన్వీనర్ రాంచందర్‌నాయక్, కొల్లూరు ఎంపీటీసీ తులసిరాంనాయక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆస్పత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే



మిడ్జిల్: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రిని ఆదివారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతా ప్రజలు కంటి సమస్యలతో బాధపడుతున్నారని వారి కోసం ఆస్పత్రి ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు గౌస్, సాయిలు, మల్లికార్జున్‌రెడ్డి, వెంకటయ్య నర్సింహ, రాజారెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆదాం, రమేష్, అశోక్, శివకుమార్, శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

భూత్పూర్: పట్టణంలోని 4వవార్డుకు చెందిన బాలగ్ల నర్సింహులు ఆదివారం అనాగరోగ్యంతో మృతిచెందాడు. విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పట్టణశాఖ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పోషయ్య, గడ్డం యాదయ్య, నాగరాజు, వినయ్ కుమార్, మండి వెంకట్, అబ్బాస్, మ్యాతరి రాములు అస్లాం ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాజాపూర్: ముదిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల (2005- 2006) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తాము చదువుకుంటున్న సమయంలో తమకు పాఠాలు బోధించిన గురువులను కార్యక్రమానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాటి రోజులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు అజ్మతుల్లా, మమత, నిర్మల, షాహీమ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మల్లేష్, సంకల్ప, ఆంజనేయులు, భరత్, శ్రీను, చిన్నయ్య, విష్ణు, సందీప్, అనిత తదితరులు పాల్గొన్నారు.

అడుగంటుతున్న భూగర్భజలాలు



కామారం సమీపంలో ఓ వ్యవసాయ బోరు వద్ద ఆగి.. ఆగి వస్తున్న నీరు

- పంటలకు నీరు అందించలేక రైతన్నల అవస్థలు

నవాబుపేట: మండల పరిధిలో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీంతో బోర్ల ద్వారా నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోతోంది. ఆగి.. ఆగి ధారలాగా నీరు వస్తుండడంతో పంటలకు నీరు పారించలేక రైతులు అవస్థలు పడుతున్నారు. రోజంతా.. బోర్లు నడిపించిన ఎకరం పొలానికి కూడా నీరు అందించలేక పోతున్నామని వాపోతున్నారు. కాగా ఆదివారం కామారంలో రైతు వెంకటయ్య పొలంలో బోరు నుంచి ఆగి.. ఆగి నీరు వస్తుండగా సాక్షి కెమెరాకు చిక్కింది.

తండాల అభివృద్ధికి కృషి చేశాం



మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

జడ్చర్ల: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తండాల అభివృద్ధికి కృషి చేశామని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని రామస్వామి గుట్ట తండాలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జాతరలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన గిరిజనుల ఆరాధ్య దైవాన్ని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి అప్పటి సీఎం కేసీఆర్ ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, నాయకులు నాగిరెడ్డి, హీర్యానాయక్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

కౌకుంట్లలో చలివేంద్రం ఏర్పాటు



కౌకుంట్లలో చలివేంద్రం ప్రారంభించిన నాయకులు

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో ఆదివారం చలి వేంద్రం ప్రారంభించారు. గ్రామానికి చెందిన సామాజిక వేత్త షేక్ అబ్దుల్ జాంగీర్ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ఎండలు విపరీతంగా ఉన్న కారణంగా వేసవి ముగిసే వరకు ప్రజలకు చల్లని స్వచ్ఛమైన తాగు నీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కిష్టన్న, సింగిల్ విండో డైరెక్టర్ కృష్ణ గోపాల్, నాయకులు తుమ్మల శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, సాంబశివుడు, రవి, నర్సిములు, నీలిఆంజనేయులు, బుడ్డారెడ్డి, వెంకటన్న, రాజు బాబుజాని పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: పర్దిపురం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఆదివారం ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యరి వంశీచందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: గోపన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పలువురు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ తీర్థం పుచ్చుకున్న వారిలో యాదవ సంఘం ముఖ్య నాయకులు, మరో 50 మంది కార్యకర్తలు తదితరులు ఉన్నారు. కాగా ఆదివారం కాంగ్రెస్ దేవరకద్ర క్యాంపు కార్యాలయం వద్దకు వచ్చిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్ కండువాలు కప్పుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ నుంచి ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయనున్న కాంగ్రెస్ అభ్యర్థి వంశీచందర్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, ఫకీరన్న, శ్రీకాంత్‌రెడ్డి, బుచ్చన్న, మండల నాయకులు అంజిల్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శాంతి సామరస్యాలు పెంపొందిద్దాం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సంస్థల ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సమాజంలో శాంతి సామరస్యాలు పెంపొందించే దిశగా కృషి చేద్దామని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వరకాలనీలో హార్ట్‌ఫుల్ నెస్ ఆధ్వర్యంలో ధ్యాన కేంద్రంలో ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవం సందర్భంగా ధార్మిక సంస్థల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో అందరం కలిసిమెలిసి సోదరభావంతో మెలిగి శాంతిస్థాపన కోసం పాటుపడుదామని కోరారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ జోనల్ కోఆర్డినేటర్ కృష్ణారావు, జిల్లా కోఆర్డినేటర్ గద్దె ఆంజనేయులు, వివిధ సంస్థల ప్రతినిధులు రాజమల్లేష్, కుర్మయ్య, నాసిర్ మజహరి, సూర్యచందర్, జయపాల్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



దేవరకద్ర: మీనుగోనిపల్లి గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి 150 మీటర్ల మేర సీసీ రోడ్డును వేసే పనులకు గ్రామ నాయకులు పూజలు చేశారు. రూ. 5 లక్షల ఎమ్మెల్యే నిధులతో ఈ పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు నరేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్రాములు ఇంకా పలువురు పాల్గొన్నారు.

‘వైన్స్’ దొంగలు దొరికేనా..?

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో వేముల రోడ్డు పక్కన ఉన్న వైన్‌షాపులో చోరీ చేసిన దొంగలు ఇప్పటి వరకు పట్టుబడలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 5న అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు వైన్‌షాపులో చోరీకి పాల్పడ్డారు. షట్టర్‌ను పగులకొట్టి లోపలికి వెళ్లిన దుండగులు అందులో ఉన్న సుమారు రూ.5.20లక్షల విలువైన మద్యం సీసాలను ఎత్తుకెళ్లారు. దీంతో పాటు వైన్‌షాపులో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను పగులకొట్టడంతో పాటు సీసీ పుటేజీ నిక్షిప్తమయ్యే డీవీఆర్‌ను కూడా వెంట తీసుకెళ్లారు. కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్‌టీంను రప్పించి ఆధారాల కోసం అన్వేశించారు. అయితే ఇప్పటి వరకు వైన్‌షాపులో చోరీకి పాల్పడిందెవరన్నది తేలలేదు. అయితే చోరీకి పాల్పడిన దొంగలు ఎలాంటి ఆధారాలు లభించకుండా పక్కాగా పని చేసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో దొంగతనం చేసినా వారు ఇంకా పట్టుబడక పోవడంతో ఈ కేసు పోలీసులకు సవాలుగా మారింది. అయితే వైన్‌షాపునకు మద్యం స్టాక్ వచ్చిన రాత్రే దొంగతనం జరగడం వెనుక తెలిసిన వారే ఉన్నారా..లేదా మరేదైనా జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే హైవేపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అపట్లో పని చేయకపోవడంతో నిందితుల ఆధారాలు లభించడం లేదని తెలుస్తోంది. దీనిపై ఎస్‌ఐ కె.సుజాతను సంప్రదించగా వైన్‌షాపులో జరిగిన చోరీలో నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు. చోరీ చేసిన మద్యాన్ని తరలించిన వాహనం ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పేర్కొన్నారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



నవాబుపేటలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

నవాబుపేట: మండలంలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ రాజునాయక్ తెలిపారు. మొత్తం 3 గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నవాబుపేటలో రెండు కేంద్రాల్లో 271, యన్మన్‌గండ్లలో 258, కొల్లూర్‌లో 103 మంది చొప్పున మొత్తం 632 మంది పరీక్షలు రాయనున్నారని వివరించారు. కాగా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

జడ్చర్ల టౌన్: మండలంలో 8 కేంద్రాలను ఏర్పాటు చేయగా 1828 మంది పరీక్ష లు రాయనున్నారు. బాదేపల్లి బాలుర జెడ్పీ హైస్కూల్‌లో 280, సెయింట్ ఆగ్నేస్‌లో 240, ఉదయ మెమోరియల్ హైస్కూల్‌లో 240, సెయింట్ ఆగ్నేస్ ఇంగ్లీష్‌మీడియంలో 230, సెయింట్ పాల్ హైస్కూల్‌లో 224, జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో 229, బాదేపల్లి బాలికల జెడ్పీహైస్కూల్‌లో 192, కోడ్గల్ జెడ్పీహైస్కూల్‌లో 193మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కాగా మొదటిరోజున పరీక్ష కేంద్రానికి గంటముందుగానే చేరుకోవాలని జడ్చర్ల, మిడ్జిల్ మండలాల ఎంఈఓ మంజులాదేవి సూచించారు.



బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో హాల్‌టికెట్లతో విద్యార్థులు

భూత్పూర్: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ నాగయ్య తెలిపారు. భూత్పూర్ ఉన్నత పాఠశాలలో 240 మంది, న్యూ ఎరా ఉన్నత పాఠశాలలో 260 విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు.